RNI. No. APTEL/2011/41055





# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 293 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 26 ఏప్రిల్ 2024 | పేజీలు : 4 | వెల : 2/-




# ఆధిక్యతలో కాంగ్రెస్ అయినా....

# అప్రమత్తత అవసరమే...!

## రసవత్తరంగా మారిన లోక్‌సభ ఎన్నికలు

## కాంగ్రెస్ వ్యతిరేకత పై కారు కేంద్రీకరణ

## ప్రధాని మోదీ ఛరిష్మా పైన్నే బీజేపీ ఆశలు

హైదరాబాద్ : రాష్ట్రంలో నేటికీ కాంగ్రెస్ కు ఆధిక్యత ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చామనే మత్తుతో ఏ మాత్రం అదామరిచినా అధ:పా తాళానికి చేరకుంటారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాం గ్రెస్ లక్ష్యంగా బీఆరెస్, బీజేపీలు ఆయుధాలను ప్రయోగిస్తున్నారు. ఈ రెండు పార్టీల ప్రయత్నాలు విఫలం కావాలంటే మారిన రాజకీయ పరిస్థితుల్లో ప్రజలను గెలుచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ మరోసారి క్షేత్రస్థాయిలో పనిచేస్తే సానుకూల పరిస్థితులు రానున్నాయి. అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అనుకూల పరిస్థితులతో పాటు, ప్రతికూల తలు కూడా ఉన్నందున ఈ ఎన్నికలను ఆషామాషీగా తీసు కుంటే ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఆధిక్యతకనబరుస్తు న్నప్పటికీ ఆ పార్టీ సర్వే నిపుణులు..కేసీ వేణుగోపాల్ వంటి అధిష్టానం నేతలు మాత్రం విజయంపై అతివిశ్వాసం పనికారాదంటూ చేస్తున్న హెచ్చరికలు లోక్ సభ ఎన్నికల టఫ్ ఫైట్‌కు నిదర్శనంగా కనిపిస్తున్నా యి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆరెస్ పాలన, సిటింగ్ ఎమ్మెల్యేలపైన వ్యతిరేకతతో ప్రజలు ప్రత్యామ్నయంగా కాంగ్రెస్ మెజార్టీ సీట్లు కట్టబె ట్టడంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ సారథ్యంలోని ప్రభుత్వం స్వేచ్ఛాయుత ప్రజాపాల నకు బాటలు వేశారు. ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీల అమలుకు అడుగు ముందుకేస్తున్నారు. ప్రజాదరణ నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**లోక్ సభ ఎన్నికల పై కాంగ్రెస్ ధీమా...** కాంగ్రెస్ పాలన..పథకాల అమలు పార్టీ జాతీయ మ్యానిఫెస్టో అంశాలు తోడై పార్లమెంటు ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలుస్తామన్ని ధీమాతో కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన ఆదరణ పార్లమెంటు ఎన్నికల్లోనూ చూపుతారన్న నమ్మకం నాయకత్వం కనబరుస్తుంది. అదిగాక అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆరెస్ నుంచి భారీగా సాగుతున్న బీఆరెస్ ఎంపీలు..ఎమ్మెల్యేల నుంచి నియోజకవర్గంలో కీలకమైన నాయకులు, క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధుల చేరికతో పార్టీ బలం పెరిగిందనే అంచనాతో ఉన్నారు.

**కీలకంగా మారిన మైనార్టీలు...** మొన్నటి ఎన్నికల్లో మైనార్టీలు అటు బీఆరెఎస్, ఇటు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినప్పటికీ తాజాగా మారిన పరిస్థితుల్లో మైనార్టీల్లో కాంగ్రెస్ పై విశ్వాసం పెరుగుతోంది. బీజేపీపై వ్యతిరేకత నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దగ్గరవుతున్నారు. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ తమకు కాంగ్రెస్‌తో పొత్తు లేదని చెప్పినప్పటికి, అనధికారికంగా ఆ పార్టీతో కలిసి సాగుతున్నారన్న చర్చ రాజకీయ వర్గాలలో జరుగుతోంది. అటు అవినీతి ఫోన్ ట్యాపింగ్ కేసులలో పీకలలోతు కూరుకుపోయిన బీఆరెస్ పార్టీ బీజేపీని ఎదుర్కొనే పరిస్థితి లేదని కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారు.

ఇదే అంశం రాజకీయ వర్గాలలో చర్చజరుగుతోంది. రాష్ట్రంలో 14శాతం ముస్లిం మైనార్టీ ఓటర్లు 2014, 2018 ఎన్నికల్లో బీఆరెస్‌కు మద్దతుగా నిలిచారు. 2023లో మాత్రం కాంగ్రెస్, బీఆరెస్‌ల మధ్య మైనార్టీ ఓట్లు చీలిపోయాయి. పాతబస్తీ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెంగ్మెంట్‌లలో ముస్లిం మైనార్టీలు 50నుంచి 80శాతం వరకు ఉన్నారు. పాతబస్తీ బయట మరో 13నియోజవర్గాల్లో 20శాతం, 21నియోజకవర్గాల్లో 15-20శాతం, 28స్థానాల్లో 10నుంచి 15శాతం ఓటర్లున్నారు. జిల్లాల వారిగా చూస్తే గ్రేటర్ పరిధిలో 43శాతం, ఆదిలాబాద్, నిజమాబాద్, మహబూబ్‌నగర్‌లలో 34శాతం, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 20నుంచి 28శాతం ముస్లిం ఓటర్లు ఉన్నారు. తాజా ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ ఓటర్లు కీలకం కానున్నారు.

**కాంగ్రెస్ పై బీఆరెస్ విమర్శలదాడి...** బీఆరెస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, ఆ పార్టీ నాయకులు కేటీఆర్, హరీష్ రావు తదితరులు కాంగ్రెస్ సర్కార్‌పైన విమర్శలు తీవ్రం చేశారు.కరవు, సాగు, తాగునీటి సమస్యలు..కాంగ్రెస్ ఎన్నికల హామీలను అస్త్రాలుగా విమర్శల దాడి ప్రజల్లో కొంత ప్రభావం చూపితే కాంగ్రెస్ ఓట్లకు గండిపడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ధరణి రద్దు..కాళేశ్వరం అవినీతి, ఫోన్ ట్యాపింగ్ సహా పలు బీఆరెస్ పథకాల అక్రమాలపై విచారణ చేపట్టి దోషులను శిక్షిస్తామని చెప్పినప్పటికీ స్ వంద రోజుల పాలనలో ఎలాంటి చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో కొంత అసంతృప్తికి కారణమవుతోంది.

**భారీగా ఉన్న బీజేపీ అంచనా...** ఇదిలా ఉండగా బీజేపీ కోణంలో 2018 ఎన్నికలతో పోలిస్తే 7శాతం ఓట్ల నుంచి 14శాతం మేరకు పెరిగిన బలంతో కనీసం ఏనిమిది ఎంపీ సీట్లయినా గెలుస్తామని అంచనా వేస్తుంది. నిజామాబాద్, అదిలాబాద్ లోక్‌సభ స్థానాల పరిధిలో ఆరు అసెంబ్లీ స్థానాలు గెలవడంతో పాటు ఆ పార్టీ 58స్థానాల్లో 20వేల నుంచి 1లక్షకు పైగా ఓట్లు సాధించడంతో పార్టీ బలం మరింత పెరిగిందని కమలనాథులు విశ్వసిస్తున్నారు. ప్రస్తుతం నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, సికింద్రాబాద్ ఎంపీ స్థానాలు బీజేపీ ఖాతాలో ఉన్నాయి. పెరిగిన ఓట్ల బలం..ప్రధాని మోదీ ఛరిష్మా, కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుందనే విశ్వాసంతో ధిక సీట్లు గెలుచుకోవాలన్న ఆశతో బీజేపీ ఉంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు సానుకూలంగా లేవనే విమర్శలున్నాయి.





## జర్నలిస్ట్ సత్యనారాయణ గౌడ్ దంపతులను సన్మానించిన గవర్నర్

### సివిల్స్ లో ర్యాంక్ సాధించిన శుభం కు మెమెంటో అందించి అభినందించిన గవర్నర్ సీపీ రాధ కృష్ణన్

హైదరాబాద్ ఏప్రిల్ 25(ప్రభాత సమాచారం):సివిల్స్ పరీక్షల్లో సత్తా చాటి 790 ర్యాంక్ సాధించిన ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ కు చెందిన ఆర్.శుభం తల్లి దండ్రులకు అరుదైన గౌరవం లభించింది. గురువారం శుభం తల్లి దండ్రులు ఆర్. సత్యనారాయణ గౌడ్-గీత లను గవర్నర్ సీపీ రాధ కృష్ణన్ హైదరాబాద్ పిలిపించి రాజ్ భవన్ లో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. కొడుకును ఉన్నంతంగా తీర్చిదిద్దిన వారి కృషిని అభినందించారు. రాత్రిపగలు శ్రమించి సివిల్స్ లో ప్రతి భ కనబర్చి ర్యాంకును సాధించిన ఆర్. శుభంను గవర్నర్ అభినందించి మెమోంటోను అందజేశారు




హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికలు-2024 హడావుడి కొనసాగుతున్న వేళ తెలంగాణలో మరో ఎన్నికకు తేదీ ఖరారైంది. ఖమ్మం-వరంగల్-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యింది. మే 2న నోటిఫికేషన్ విడుదలకానుంది. నామినేషన్‌కు చివరి తేదీ 9గా ఉంది. ఇక నామినేషన్ పరిశీలనకు మే 10, ఉపసంహరణ తేదీ మే 13 అని ఎలక్షన్ కమిషన్ తెలిపింది. కాగా మే 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. ఇక జూన్ 5న ఎలక్షన్ కమిషన్ కౌంటింగ్ చేయనుంది.

# అవునా... అంతమందా!?

## కేసీఆర్ తో టచ్ లో ఉన్న కాంగ్రెస్ ముఖ్యులెవరు..!!



హైదరాబాద్ : : తెలంగాణలో ఎన్నికల రాజకీయం కొత్త టర్న్ తీసుకుంది. కేసీఆర్ వర్సస్ రేవంత్ మధ్య ఈ ఎన్నికల యుద్ధం ప్రతిష్ఠాత్మకంగా మారుతోంది. బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ తమ వైపు ఆకర్షించే ప్రయత్నం చేస్తుంటే...కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేసారు.పార్లమెంట్ ఎన్నికల తరువాత తెలంగాణలో రాజకీయ సమీకరణాలు మారుతాయనే సంకేతాలు ఇచ్చారు. తెలంగాణ లో బీజేపీ ఆలోచనల పైనా సందేహాలు వ్యక్తం చేసారు. కాంగ్రెస్ నుంచి తనతో టచ్ లో ఉన్నారని కేసీఆర్ చెబుతున్న నేతలు ఎవరు.

**టచ్ లో కాంగ్రెస్ నేతలు :** తమతో కాంగ్రెస్ పార్టీకి చెందిన 25 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పలం కలకలం రేపుతోంది. బీఆర్ఎస్‌తో చేతులు కలిపేందుకు 25, 26 మంది రెడీగా ఉన్నామని తమ పార్టీ నేతలతో చెప్తున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. తాజాగా ఒక టీవీ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు.

బీజీపీఎల్పీ లీడర్ మహేశ్వర్‌రెడ్డి రెండు లేదా మూ డు రోజులకోసారి వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తున్నారని గుర్తు చేసారు. మూడు నెలల్లో ఈ ప్రభుత్వం పోతది, డబుల్ ఇంజిన్ సర్కారు వస్తది అని లక్ష్మణ్ స్టేట్‌మెంట్ ఇవ్వటం పైన కేసీఆర్ వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్ కు ఆఫర్ :** ముఖ్యమంత్రే మారుతారని ప్రచారం జరుగుతుంటే..ఒక్కరోజు కూ డా సీఎం ఖండించలేదని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ ఏదో కార్యక్రమానికి హైదరాబాద్ వస్తే, ఆప్ బడే భాయ్ హై, మై చోటే భాయ్ హై అనటం పైన కేసీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ లో కొందరిలో అనుమానాలు మొదలయ్యాయని కేసీఆర్ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌లో ఉన్న కొందరు మీరు, మేము కలిసి గవర్నమెంట్ ఫామ్ చేద్దామని తమ నేతల వద్దకు ప్రతిపాదనలు వచ్చాయని కేసీఆర్ చెప్పుకొచ్చారు.

ఆ సమచారం తనకు వచ్చిందన్నారు. అయితే, ఎవరనేది చెప్పేందుకు కేసీఆర్ నిరాకరించారు.

**రేవంత్ వర్సస్ కేసీఆర్ :** కేసీఆర్ సభల్లోనే చేసిన ఇదే తరహా వ్యాఖ్యల పైన రేవంత్ ఘాటుగా స్పందించారు. తాను జానారెడ్డి, జైపాల్ రెడ్డిని కాదని..తమ పార్టీ ఎమ్మెల్యేలను ఎలా కాపాడుకోవాలో తనకు తెలుసని చెప్పుకొచ్చారు. ఇప్పుడు కేసీఆర్ మరోసారి ఇదే అంశం పైన చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో తమకు 8-12 సీట్లు వస్తాయని కేసీఆర్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకి ఒకటి లేదంటే అసలు రాకపోవచ్చిన చెప్పుకొచ్చారు. కడియం శ్రీహరి చేసిన పనితో తాము వరంగల్ గెలుస్తున్నామని చెప్పారు. కేసీఆర్ వ్యాఖ్యల పైన ఎన్నికల సభల్లో కేసీఆర్ ఏ రకంగా స్పందిస్తారనేది చూడాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# కేటీఆర్, హరీశ్..

## చింత చచ్చినా పులుపు చావలేదు!

మిషన్ కాకతీయ, మిషన్ భగీరథల పేరుతో కేసీఆర్ ప్రభుత్వం గత పదేళ్లలో చేపట్టిన ప్రాజెక్టులు మేడిపండు చందమేనని ఒక్కో ప్రాజెక్టు నిరూపిస్తున్నాయి. ఇప్పటికే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలకు నిలువెత్తు తార్కాణంగా నిలిచిందని స్వయంగా నిపుణులే వ్యాఖ్యానించారు. పిల్లర్లు కుంగిపోయాయి.. గోడలు నెర్రెలిచ్చాయి. నీటి నిల్వకు మేడిగడ్డ బ్యారేజీ పనికిరాదని నిపుణుల బృందం కూడా తేల్చింది. అయినా కిందపడ్డా చేయి పైనే ఉంది అన్న చందంగా బీఆర్ఎస్ అగ్ర నేతలు కేటీఆర్, హరీశ్ ల వ్యవహార శైలి ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కళ్ల ముందే మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లు భారీ ఎత్తున కనిపిస్తున్నా.. తమ వైఫల్యాన్ని ఒప్పుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. పైగా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మేడిగడ్డ ప్రాజెక్టుకు రిపేర్లు చేయించాలని కేటీఆర్, హరీశ్ ఉచిత సలహాలివ్వడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ నేతలు, నిపుణుల బృందాన్ని వెంటేసుకుని కేటీఆర్ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల వద్ద హడావుడి చేసిన సంగతి తెలిసిందే. మేడిగడ్డి పిల్లర్లు కుంగిపోయి, ప్రాజెక్టు గోడలు భారీగా నెర్రెలిచ్చి కళ్ల ముందు కనిపిస్తున్నా కేటీఆర్, హరీశ్ వాటిని చిన్నవిగా చూపించి మాట్లాడుతుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. భారీ ఎత్తున నిధులు స్వాహా చేయడంతోపాటు కమీషన్లు దండుకున్నారని.. నాణ్యతాలోపాలతో ప్రాజెక్టులు నిర్మించారని నిపుణులు, అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. పైగా తమ తప్పును ఒప్పుకోకుండా వరదలు వచ్చే లోపు, వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు యుద్ధప్రాతిపదికన రిపేర్లు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుండటం విస్తుగొలుపుతోంది. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనంగా మేడిగడ్డ బ్యారేజీ కనిపిస్తున్నా కేటీఆర్, బీఆర్ఎస్ బృందం రాష్ట్ర ప్రభుత్వానికి సుద్దులు చెప్పడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, నిపుణుల బృందం మేడిగడ్డ బ్యారేజీ నీటి నిల్వకు పనికిరాదని తేల్చింది. కుంగిన పిల్లర్లకు రిపేర్లు చేయించినా పనికిరావని పేర్కొంది. ఈ నేపథ్యంలో రేవంత్ ప్రభుత్వాన్ని బదనాం చేయాలని ప్రయత్నించి కేటీఆర్, హరీశ్ ల బృందమే అభాసుపాలయ్యిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ, మరమ్మతుల వ్యవహారం మళ్లీ మొదటికొచ్చింది. బ్యారేజీని పునరుద్ధరించాలంటే మళ్లీ ఒప్పందం చేసుకోవాల్సిందేనని నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ స్పష్టం చేసింది. బ్యారేజీలోని ఏడో బ్లాకుపై ఎలక్ట్రోట్ రెసిస్టివిటీ టెస్టులు (ఈఆర్టీలు) జనవరి 4 నుంచి 9వ తేదీ మధ్య జరిగిన సంగి తెలిసిందే. దాని ఫలితాలు ఇవ్వడానికి కూడా నిర్మాణ సంస్థ నిరాకరించింది. బ్యారేజీ నిర్మాణం కోసం 2016 ఆగస్టు 26న ఒప్పందం జరిగిందని, నీటిపారుదల శాఖ ఇచ్చిన ఆదేశాలు, డిజైన్లు, డ్రాయింగ్ ఆధారంగా నిర్మాణం చేపట్టామని ఆ సంస్థ చెబుతోంది. 2021 మార్చి 15న బ్యారేజీ పనులు పూర్తయినట్లు సంబంధిత అధికారులు సర్టిఫికెట్ ఇచ్చారని ఎల్ అండ్ టీ గతంలోనే స్పష్టం చేసింది. కాఫర్ డ్యామ్ కట్టాలంటే రూ.55.75 కోట్లు అవుతుందని, ఆ మేరకు ఒప్పందం చేసుకుంటేనే పనులు చేస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీని నాణ్యతా లోపాలతో నిర్మించిందని స్పష్టమవుతోంది.

# లెక్కలు తేలేనా?



సిరిసిల్ల: జిల్లా వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వం సంక్షేమ, పాఠశాల విద్యాశాఖలకు సంబంధించిన వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఇచ్చింది. అయితే పరిశ్రమ వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యం ఆశించిన మేరకు నెరవేరలేదు. మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లలో బోగస్‌వి ఉన్నట్లు ఇటీవల రాష్ట్ర చేనేత, జౌళిశాఖకు ఫిర్యాదులు వెళ్లాయి. వీటి కారణంగా నిరంతరాయంగా కష్టపడుతున్న ఆసాములు, కార్మికులకు చెందాల్సిన ప్రయోజనాలు పక్కదారి పట్టాయనే ఆరోపణలున్నాయి. దీనిపై చేనేత, జౌళిశాఖ కమిషనర్ అలుగు వర్షిణి జిల్లాలోని మ్యాక్స్ సంఘాలు, ఎస్ఎస్ఐల్లోని రికార్డులను తనిఖీ చేసి పూర్తి నివేదికను రూపొందించాలని టెస్కోలోని ఒక ఉన్నతాధికారికి బాధ్యతలు అప్పగించారు. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, జౌళిశాఖకు చెందిన వివిధ జిల్లాల్లోని 18 మంది డీఏవోలు, ఏడీలు సిరిసిల్లకు చేరుకున్నారు. వీరంతా 2016 నుంచి 2024 వరకు సంఘాలకు కేటాయించిన ఆర్డర్లు, వాటికి సంబంధించిన నూలు, ముడి సరకుల కొనుగోలు, ఉత్పత్తి చేసిన వస్త్రం, టెస్కోకు అప్పగింత, ప్రభుత్వ చెల్లింపులను యూనిట్ల వారీగా వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. బోగస్‌వి ఉన్నట్లు గుర్తించి...జిల్లాలో ప్రస్తుతం 139 మ్యాక్స్ సంఘాలు, 120 ఎస్ఎస్ఐ యూనిట్లు ఉన్నాయి. గతేడాది జరిగిన విచారణలో ఎస్ఎస్ఐ యూనిట్లలో 22 బోగస్‌వి ఉన్నట్లు గుర్తించి, వాటికి ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వలేదు. అయితే మ్యాక్స్ సంఘాల్లోనూ కొన్ని యూనిట్లలో అసలు మరమగ్గాలు లేని వారు సభ్యులుగా కొనసాగుతుండటం, వారికి వచ్చిన ఆర్డర్లను ఇతరులతో ఉత్పత్తి చేయించి రాయితీలు పొందుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. దీనిపై అప్పట్లో పూర్తి విచారణ జరగలేదు. 1964 చేనేత సహకార చట్టం ప్రకారం నాలుగు మ్యాక్స్ సంఘాలు, 1995 చట్టం ప్రకారం 136 నమోదయ్యాయి. వీటి పర్యవేక్షణ బాధ్యత ఏడీ, కమిషనర్‌లకే ఉంటుంది. 1995లో సవరించిన చట్టం ప్రకారం సంఘాల నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ఆయా సంఘాలకే అప్పగించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పర్యవేక్షణ వరకే అధికారుల బాధ్యతలను పరిమితం చేశారు. కాగా ప్రతి సంఘంలోనూ విధిగా సభ్యులతో సమావేశాలు నిర్వహించాలి. మినిట్స్ పుస్తకంలో తీర్మానాలు నమోదు చేయాలి. ఆర్డర్లు, వస్త్రోత్పత్తులు, ముడి సరకుల కొనుగోలు, చెల్లింపులు వంటి ఆర్థిక లావాదేవీలకు ఎప్పటికప్పుడు రికార్డులు నిర్వహించాలి.

విచారణలో లోటుపాట్లు

రాష్ట్ర చేనేత, జౌళిశాఖ నేతృత్వంలో 18 మంది అధికారుల బృందం నాలుగు రోజులుగా సంఘాల్లో తనిఖీలు చేపడుతుంది. కానీ ఏ సంఘంలోనూ సరైన రికార్డులు లభించడం లేదు. జిల్లా పరిశ్రమకు 2016-17 నుంచి 2022-2023 వరకు ఏటా సగటున రూ.350 కోట్ల వస్త్రోత్పత్తుల ఆర్డర్లు వచ్చేవి. వీటి సేకరణ పూర్తిగా టెస్కో ఆధ్వర్యంలో జరుగుతుంది. వారు సేకరించిన వస్త్రంతోపాటు కొనుగోలు చేసిన నూలు బిల్లులు సమర్పించాకే విడతల వారీగా బిల్లులు విడుదలయ్యేవి. టెస్కోపై పూర్తి భరోసాతో సంఘాల్లో రికార్డుల నిర్వహణను విస్మరించారు. ప్రస్తుతం ఒక్కో సంఘంలో దాదాపు నాలుగేళ్లకు పైగా రికార్డులు లేవు. ఇప్పటికే గతేడాది బకాయిల విడుదలకు పరిశ్రమ వర్గాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. కానీ ఇక్కడ 2016 తర్వాత ఒకటి, రెండేళ్లు మాత్రమే సంఘాలు రికార్డులు నిర్వహించినట్లు తెలుస్తుంది. తర్వాత ఎలాంటి రికార్డులు లేనట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఇప్పుడు ఈ రికార్డులన్నీ రాయాలంటే నెల రోజులపైనే సమయం పడుతుంది. తనిఖీలకు ఇచ్చిన గడువు మాత్రం పది రోజులుగా అధికారులు చెబుతున్నారు.

# నిధులున్నా ప్రారంభం కాని పనులు



సిరిసిల్ల: గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు రవాణా వ్యవస్థ మెరుగుపరిచి రెండు జిల్లాల గ్రామాలను అనుసంధానం చేయాలనే లక్ష్యంతో తారు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇది జరిగి ఏడాది అవుతున్నా పనులకు మోక్షం లభించటం లేదు. అటవీశాఖ నుంచి అనుమతి రాక పనులు సాగని దుస్థితి నెలకొంది. దీంతో మూడు జిల్లాల ప్రజలకు రవాణా కష్టాలు తీరడం లేదు. రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్ల- నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పేట మండలం మానాల, గిరిజన గ్రామాలను అనుసంధానం చేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను ప్రభుత్వం సుమారు 5 కిలో మీటర్ల తారు రోడ్డుకు రోడ్లు, భవనాల శాఖ నిధులు రూ. 9 కోట్లను ఏడాది క్రితం మంజూరు చేసింది. దీంతో పనులు చేపట్టడానికి అధికారులు గుత్తేదారును ఖరారు చేశారు. అయితే పనులు మాత్రం ఏడాదిగా ప్రారంభం కాలేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు అటవీప్రాంతం మీదుగా మట్టి రోడ్డుపై ద్విచక్రవాహనాలు, కాలినడకన రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైతే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రయాణించి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి చేస్తే ప్రయోజనం ఇలా...

తారు రోడ్డు నిర్మాణంతో మూడు జిల్లాల వారికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కలగనున్నది. వాహనదారుల కష్టాలు కూడా తీరనున్నాయి. గతంలో జగిత్యాల జిల్లా కోరుట్ల ఆర్టీసీ డిపో అధికారులు రుద్రంగి, మానాల, మరిమడ్ల, వీర్నపల్లి మండల కేంద్రం మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం వరకు బస్సులు నడిపేవారు. దశాబ్ద కాలంగా బస్సులు తిరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా రహదారి ఏర్పాటైతే మరిమడ్లలోని ఏకలవ్య గిరిజన ఆదర్శ పాఠశాలకు బస్సు సౌకర్యం కలగనున్నది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. మూడు జిల్లాల గ్రామీణ, గిరిజన గ్రామాల అభివృద్ధికి బాటలు పడనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన పంట ఉత్పత్తులు, కూరగాయలను ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా రైతులు ఆర్థికంగా బలపడటానికి దోహదపడుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు దృష్టిసారించి సకాలంలో తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.త్వరలో ప్రారంభం తారు రోడ్డు పనులు చేపట్టడానికి గుత్తేదారును ఖరారు చేశాం. పనులు అటవీ ప్రాంతం మీదుగా చేపట్టాల్సి ఉండటం తో అటవీశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉంది. దీనిపై రెండు, మూడు రోజుల్లో స్పష్టమైన హామీ వచ్చే అవకాశం ఉంది. పనులు చేపట్టడానికి గుత్తేదారు యంత్రాలు, సామగ్రిని తరలించారు. మరిమడ్లకు చెందిన పలువురి రైతుల వరి పొలాలు కోతకు వచ్చాయి. వారు వారం రోజులు గడువు కోరారు. పది రోజుల్లో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.
సతీశ్, ఏఈ, ఆర్అండ్‌బీ, కోనరావుపేట

# ప్రత్యేక నిధులు.. తీరనున్న ఇక్కట్లు

గోదావరిఖని పట్టణం: రామగుండం నగరపాలక ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు అమృత్-2.0, యు.ఐ.డి.ఎఫ్.(అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్) నిధులతో పరిష్కారం కానున్నాయి. గోదావరి నదీ జలాల శుద్ధి కార్యక్రమంలో భాగంగా సుమారు మూడు దశాబ్దాల క్రితం రామగుండంలో శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ గాడి తప్పడంతో పారిశ్రామిక ప్రాంతంలోని మురుగు జలాలు నేరుగా గోదావరినదిలో కలుస్తున్నాయి. ఈ ప్రాంతంలో మురుగు జలాల శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని కాలుష్య నియంత్రణ మండలి, హరిత ట్రిబ్యునల్ పలుమార్లు నగరపాలికకు నోటీసులు జారీ చేయడంతో ప్రభుత్వంలో చలనం మొదలైంది. మురుగు జలాల శుద్ధి కోసం అనేకసార్లు అంచనాలు సిద్ధం చేసినప్పటికీ నిధుల కొరతతో పాటు వివిధ కారణాలతో ఆచరణకు నోచుకోలేదు. తాజాగా 'అమృత్-2.0'లో రామగుండంలో ప్రధాన మురుగు కాలువలు, మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్వహణకు రూ.252.82 కోట్లు మంజూరు చేయడంతో త్వరలోనే మురుగు సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది. మురుగు జలాల శుద్ధి కేంద్రాల నిర్వహణకు అవసరమైన స్థల సేకరణకు మరో రూ.3 కోట్లు కేటాయించారు.రామగుండం నగరపాలక ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం యు.ఐ.డి.ఎఫ్. నుంచి రూ.88.9 కోట్లు ప్రకటించారు. ఇందులో 85 శాతం నిధులను నేషనల్ హౌసింగ్ బ్యాంకు ద్వారా రుణసాయం అందించనుండగా మిగతా 15 శాతం నిధులను నగరపాలిక సమకూర్చుకోవాల్సి ఉంటుంది. నేషనల్ హౌసింగ్ బ్యాంకు రుణం అందించాక రెండేళ్ల పాటు మారటోరియం విధించనుండగా ఆ తర్వాత అయిదేళ్లలో అయిదు సమాన వాయిదాల్లో రుణసాయాన్ని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే 'అమృత్' నిధులతో రామగుండం కార్పొరేషన్‌లోని భీమునిపట్నం, సీఎస్పీ కాలనీ, విఠల్‌నగర్‌లో మూడు ట్యాంకులతో పాటు 16 కిలోమీటర్లు నీటి సరఫరా ప్రధాన పైపులైన్లు, 150 కిలోమీటర్లు ఇంటింటా నీటి సరఫరా కోసం డిస్ట్రిబ్యూషన్ పైపులైన్లు నిర్మించడంతో పాటు 20 వేలకు పైగా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు ఇచ్చారు. రామగుండంలో మొత్తం 13 ట్యాంకుల ద్వారా నీటి సరఫరా కొనసాగుతున్నప్పటికీ వివిధ కారణాలతో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో నెలకొన్న ఇక్కట్లు తీర్చడంతో పాటు నీటి సరఫరా తీరును మరింత మెరుగు పరుస్తూ ప్రజలకు నిరంతరంగా నీటిని సరఫరా చేసేందుకు యు.ఐ.డి.ఎఫ్. నిధులు ఉపయోగపడే అవకాశముంది.

అమృత్-2.0 కేటాయింపులు (రూ. కోట్లలో)
కేంద్ర ప్రభుత్వం 68.88
రాష్ట్ర ప్రభుత్వం 118.43
15వ ఆర్థిక సంఘం 19.35
నగరపాలిక 46.16
తాగునీటి సరఫరాకు 88.9

# అనర్థం.. చెత్తలో బయో వ్యర్థం

నల్గొండ : ఆసుపత్రుల్లో జాగ్రత్తలు తీసుకునే వైద్యులు తమ ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. వాటిల్లో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లకుండా ధ్వంసం చేయాల్సి ఉంది. కానీ.. చాలా చోట్ల ఇదేమీ పట్టడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పురపాలిక తరలించే చెత్తలో కలిసి పోతున్నాయి.

చట్టాల ఉల్లంఘన..

ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల్లో రోగులకు వినియోగించే ఇంజెక్షన్లు, సూదులు, బ్యాండేజీలు, బ్లేడ్స్, సెలైన్‌సీసాలు వంటి వ్యర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన పద్ధతుల్లో ధ్వంసం చేయకుంటే వాటి ద్వారా ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితి తలెత్తకుండా ఆసుపత్రి వ్యర్థాల నియంత్రణ చట్టం 1998 ప్రకారం వాటిని వేరు చేసి పర్యావరణానికి నష్టం లేకుండా ధ్వంసం చేయాలనే నిబంధన తెచ్చారు. సూచించిన రంగుల డబ్బాలను ఆసుపత్రులు, ల్యాబ్స్, క్లీనిక్‌ల్లో ఏర్పాటు చేసి సంబంధిత వ్యర్థాలను వాటిల్లో వేసి కాలుష్య నియంత్రణ మండలి సంస్థ అనుమతి పొందిన సంస్థ నిర్వహించే వాహనాలకు అందించాల్సి ఉంది. ఆ సంస్థ సేకరించిన వ్యర్థాలను ఆవాసాలకు దూరంగా ఏర్పాటు చేసిన ప్లాంటులో శాస్త్రీయ పద్ధతిలో కాల్చివేయాలి. కానీ.. ఆ పద్ధతులు



అవలంభించడం లేదు. ఆసుపత్రుల పడకల సంఖ్య ప్రకారం ఒక్కో పడకకు రూ.150 వరకు ఇవ్వాల్సిన ఖర్చుల నుంచి తప్పించుకునేందుకు పురపాలిక చెత్తలో బయో వ్యర్థాలను పారబోస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

యథేచ్ఛగా దహనం..వైద్యఆరోగ్యశాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నిర్లక్ష్యంతో నిబంధనలు గంగలో కలుస్తున్నాయి. జిల్లాలోని 8 పురపాలికల పరిధిలో సుమారు 100కు పైగా ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు, ల్యాబ్‌లు, ఉన్నాయి. వీటికి తోడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఆస్పత్రుల నుంచి పోగవుతున్న టన్నుల కొద్ది వ్యర్థాలు, చెత్తను పూర్తిగా నిత్యం పురపాలిక వాహనాల ద్వారా చెత్త డంపింగ్‌యార్డుకు తరలించి అక్కడ దహనం చేయడంతో పరిసర గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మరో పక్క చెత్తను తరలించే సమయంలో పుర కార్మికులకు ఏమరు పాటులో సిరంజీలు చేతులకు, కాళ్లకు తగిలి వ్యాధులకు గురవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

ప్రైవేటు ఆసుపత్రుల నుంచి వెలువడే బయో వ్యర్థాలు పురపాలిక డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నట్లు సమాచారం మాకు లేదు. మా సిబ్బందికి వాటిని తరలించకూడదని ఆదేశాలు జారీ చేస్తాం. చెత్తకుప్పల్లో బయో వ్యర్థాలను పారబోస్తున్న ఆసుపత్రులను గుర్తించి నోటీసులు జారీ చేయడంతోపాటు వాటిపై కేసులు నమోదు చేయిస్తాం.

# విత్తనం.. ఎవరిదీ పెత్తనం

ఆలేరు : వరి విత్తనాలకు ప్రభుత్వం రాయితీ ఇవ్వడం లేదు. రైతన్నలపై విత్తన భారం పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం పరిశోధనా స్థానాలు, ఐఆర్ఆర్, ఐసీఏఆర్ తదితర కేంద్ర సంస్థల నుంచి విడుదలైన విత్తన రకాలనే సరఫరా చేస్తుంది. అవీ పాతవి ఎక్కువ సరఫరా చేస్తుండటంతో రైతులు అంతగా ఆసక్తి చూపడం లేదు. దిగుబడులే లక్ష్యంగా ప్రైవేటు కంపెనీలు, ఏజెన్సీలు విత్తన రకాలను విడుదల చేసి మార్కెటింగ్ చేస్తున్నాయి. ఒక ప్రాంతానికి పనికిరావని తేలిన తర్వాత ఇతర ప్రాంతాల్లో విడుదల చేస్తున్నారు. ఇక్కడ విజయవంతం కావడంతో అమాంతం ధర పెంచేస్తున్నారు. అది రైతులపై పెనుభారంగా మారుతోంది. ఇటీవల ప్రైవేటు విత్తనాల కంపెనీలదే పెత్తనం సాగుతోంది. విత్తనాలు సరిగా లేకపోయినా, కల్తీ, నకిలీ విత్తనాలు సరఫరా చేసినా అంతగా జరిమానాలు, శిక్షలు లేకపోవడంతో ప్రైవేటు దందాపై అడ్డూ అదుపూ లేకుండా పోయింది. రైతులు ఏటా ఏదో ఒక జిల్లాలో మోసపోయి నష్టం చవిచూస్తూనే ఉన్నారు.

విత్తన రాయితీ..పదేళ్ల క్రితం వరకు రైతులకు ప్రభుత్వం రాయితీ విత్తనాలు సరఫరా చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత విత్తన రాయితీ ఎత్తేసింది. కేంద్రం ఇచ్చే ఎన్ఎస్ఎం(నేషనల్ సెక్యూరిటీ మిషన్) రాయితీ కిలోకు రూ.5 ఉండేది. కేంద్రం అది తీసేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సైతం రైతులకు రాయితీ ఇవ్వలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే పరిస్థితి కొనసాగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం రాయితీ లేకుండా కొన్ని రకాల విత్తనాలు సరఫరా చేస్తోంది. అయినా రైతులు వాటిని కొనడం లేదు. నాలుగు సంవత్సరాల క్రితం వరకు బీపీటీ (సాంబమసూరి) విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా సహకార సంఘాల్లో ఉంచి అమ్మేవారు. ప్రైవేటు విత్తనాలు రావడంతో బీపీటీ ఇతర వంగడాలను కొనడం మానేశారు. రెండు సంవత్సరాల పాటు విత్తనాలు తెప్పించి తిరిగి పంపించారు. దాంతో వ్యవసాయ శాఖ సైతం ఆ విత్తనాలు తీసుకురావడం లేదు. ఐదేళ్లుగా ఏ రకమైన వరి విత్తనాలూ సరఫరా చేయడం లేదని జిల్లా వ్యవసాయాధికారి జి.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పరిశోధనా స్థానాలలో విడుదలైన కొన్ని రకాలు రాష్ట్రం అంతటా అనుకూలంగా ఉండటం లేదు. కరీంనగర్, జగిత్యాల, వరంగల్ జిల్లాల్లో విడుదలైన రకాలు ఇక్కడ ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడం, అక్కడి నేలల్లో సన్నాలుగా ఉండి ఇక్కడి నేలల్లో దొడ్డుగా ఉండటంతో రైతులు వాటిపై ఆసక్తి చూపడం లేదు.

సన్నాలకే మొగ్గు..ఉమ్మడి జిల్లాలో 12 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా అందులో దాదాపు 8 లక్షల ఎకరాల్లో సన్నాలే సాగు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం వరకు సగం దొడ్డు రకాలు సాగుచేశారు. ప్రైవేటు విత్తనాలు 50 రకాలు మార్కెట్‌లోకి రావడం, దిగుబడులు ఆశించిన దానికంటే ఎక్కువగా రావడంతో వాటిపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. పరిశోధనా స్థానాల నుంచి విడుదలైన రకాల్లో ఎకరానికి 40-45 బస్తాల దిగుబడి ఉండగా, ప్రైవేటు రకాలు కొత్తగా వచ్చినవి 50-55 బస్తాల వరకు దిగుబడి ఇస్తున్నాయి. అందుకే ప్రైవేటు కంపెనీలు రైతులపై పెత్తనం చెలాయిస్తున్నాయి. వారు చెప్పిన ధరకే కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దిగుబడి ఎక్కువగా వచ్చే విత్తనాల కృత్రిమ కొరత సృష్టించి ధరను పెంచేస్తున్నాయి.

# పట్టాలెక్కని ప్రతిపాదనలు

పెద్దపల్లి: ఉమ్మడి జిల్లాలో రైల్వే శాఖపరంగా అభివృద్ధికి అడుగులు పడాలని ప్రయాణికులు ఆశిస్తున్నారు. ఏళ్ల తరబడి పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడంతో పాటు కొత్త రైళ్ల ప్రారంభం, హాల్టింగ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేలా నేతలు చొరవ చూపాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్లే రైళ్లకు హాల్టింగ్‌లు కల్పించడంతో పాటు కేటాయింపులు పెంచాలని విన్నవిస్తున్నారు. పెద్దపల్లి-నిజామాబాద్, కాజీపేట-బల్లార్షా మార్గాల్లో రైళ్లను పొడిగించాల్సి ఉంది. కరీంనగర్ నుంచి ఢిల్లీ, ఆగ్రా, మధుర, నాగ్‌పూర్ ప్రాంతాలకు నిత్యం వాణిజ్య అవసరాలపై వెళ్లేవారు అధిక సంఖ్యలో ఉంటారు. పేద, మధ్యతరగతి వర్గాల సంపాదనలో 5 శాతం ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోంది. పెరిగిన బస్సు ఛార్జీల కంటే చవకైన రైలు ప్రయాణం అందరికీ అందుబాటులోకి వచ్చేలా నేతలు కృషి చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇవీ అవసరాలు..

కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సంపర్క్ క్రాంతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుండగా తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లవుతున్నా ఆ రైలు ఊసే లేదు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్-కరీంనగర్-పెద్దపల్లి మార్గంలో ఢిల్లీకి రైలు నడిపించాలన్న విజ్ఞప్తులు ఇటీవలి కాలంలో వినిపిస్తున్నాయి.

తెలంగాణ, జీటీ, కేరళ ఎక్స్‌ప్రెస్‌కు జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్‌లలో హాల్టింగ్ కల్పిస్తే ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. గోవా వీక్లీ ఎక్స్‌ప్రెస్, కాశీ తమిళ సంగమం వీక్లీ, అయోధ్య-రామేశ్వరం, పూరి-ఓఖా వీక్లీ సూపర్‌ఫాస్ట్ రైళ్లను నిలిపితే కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల వ్యాపారులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉంటుంది.కరీంనగర్-తిరుపతి బై వీక్లీ సూపర్‌ఫాస్ట్‌ను ఓదెల, సుల్తానాబాద్, ఉప్పల్ స్టేషన్‌లలో నిలపడంతో పాటు ప్రతి రోజూ నడుపుతూ నిజామాబాద్ వరకు పొడిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.నిజామాబాద్ నుంచి పెద్దపల్లి మీదుగా వరంగల్ వరకు పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడిపిస్తే వేలాది మందికి ప్రయోజనం ఉంటుంది. ఈ మార్గంలో ప్రతి 15 నిమిషాలకు ఆర్టీసీ బస్సులు నడుస్తున్నా ప్రయాణ సమయం అధికంగా ఉంటోంది.

పెద్దపల్లి, ఓదెల, జమ్మికుంటల నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లడానికి ఉదయం 6 తర్వాత భాగ్యనగర్ తప్ప మరో రైలు లేదు. చిరు వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులకు అనుకూలంగా ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య ఇంటర్‌సిటీ, పుష్‌పుల్ రైళ్లను నడపాలన్న డిమాండ్లు దశాబ్ద కాలంగా ఉన్నాయి.

కాజీపేట-బల్లార్షా మార్గంలో నూతన ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభించి సికింద్రాబాద్ నుంచి కోల్‌కతా వరకు నడిపించాలని పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్‌కు వెళ్లాలంటే వరంగల్‌కు వెళ్లి ఈస్ట్ కోస్ట్‌లో ప్రయాణించాల్సి వస్తోంది.

జగిత్యాల జిల్లా నుంచి ముంబయి వెళ్లే వారు అధిక సంఖ్యలో ఉంటుండటంతో కరీంనగర్ మీదుగా ప్రత్యేక వీక్లీ రైలు నిలపాలన్న డిమాండ్ ఉంది. ప్రస్తుతం కరీంనగర్ వరకు నడుస్తున్న రైలును సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు పొడిగించాల్సి ఉంది.

పెద్దపల్లి-కరీంనగర్-నిజామాబాద్ మార్గంలో డబ్లింగ్ పనులు చేపట్టడం ద్వారా ప్రయాణ రైళ్ల సంఖ్య పెరిగి శిరిడీ, గుజరాత్‌కు త్వరగా చేరుకోవచ్చు.

స్టేషన్ల ఆధునీకరణే ప్రధానం పెద్దపల్లి జంక్షన్‌ను ఆర్‌పీఎఫ్‌ను కేటాయించడంతో పాటు క్వ్రాలబీన్ కూడా ఏర్పాటు చేసి పోలీసులకు సదుపాయాలు, లిఫ్ట్, ఎస్కలేటర్ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్న ప్రతిపాదనలు అమలు కావడం లేదు. స్మార్ట్ సిటీగా పేరొందిన కరీంనగర్ స్టేషన్‌లో మరో రెండు ప్లాట్‌ఫామ్‌లు ఏర్పాటు చేసి రైళ్లు పెంచాలి. కరీంనగర్, జగిత్యాల స్టేషన్‌లలో 24 రైల్వే కోచ్ వెడల్పుతో నూతన పిట్‌లైన్‌ను ప్రకటించాలి. కోరుట్ల స్టేషన్‌లో నూతన సరకు రవాణా షెడ్డును, కొండగట్టు వద్ద నూతన స్టేషన్‌ను మంజూరు చేయాలి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వేములవాడకు రైళ్ల రాకపోకలు పెంచాలి.

'కోల్ కారిడార్'తో బహుళ ప్రయోజనాలు

రామగుండం నుంచి మంథని, భూపాలపల్లి మీదుగా మణుగూరు వరకు 199 కిలోమీటర్ల మేర గతంలో ప్రతిపాదించిన రైల్వే 'కోల్ కారిడార్' ఏర్పాటుతో సరకు రవాణాకు, ప్రయాణికుల రాకపోకలకు అనువుగా ఉంటుంది. మేడారం జాతరతో పాటు రామప్ప, లక్నవరం వంటి పర్యాటక స్థలాలకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుంది. పెద్దపల్లి-నిజామాబాద్ మార్గంలో 177 కిలోమీటర్ల మేర డబుల్ ట్రాక్ ఏర్పాటుతో సరకు రవాణా వేగవంతంగా జరుగుతుంది. వేములవాడ సమీపంలోని కొత్తపల్లి-మనోహరాబాద్ నూతన మార్గానికి భూ సర్వే వేగవంతంగా పూర్తి చేసి త్వరగా అందుబాటులోకి తేవాల్సి ఉంది.

# విత్తనోత్పత్తికి అనుకూలం.. ప్రోత్సహించాల్సిన అవసరం

గజ్వేల్: వ్యవసాయంలో కీలకమైన విత్తనాలను కర్షకులు సేకరించడానికి అధిక ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎక్కడో తయారు చేసిన వాటిని ఇక్కడి భూముల్లో విత్తితే చివరికి పంట ఎదుగుతుందో లేదోననే అనుమానం. ఇందుకు పరిష్కారంగా స్థానికంగానే విత్తనోత్పత్తి చేపట్టాలని.. అందుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. విత్తనోత్పత్తిపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. మూడేళ్ల కిందట జిల్లాలో విత్తన సాగు ప్రక్రియ నిలిచింది. దాదాపు 3 లక్షల మంది రైతులు ఏటా రెండు సీజన్‌లలో 7 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. మేలైన విత్తనాలను సమకూర్చటం ప్రభుత్వానికి పెద్ద ఛాలెంజ్‌గా మారిపోయింది. గత ప్రభుత్వం పలు గ్రామాలను ఎంపిక చేసి వరి, మొక్కజొన్న, కంది, శనగ ఇతర విత్తనాల ఉత్పత్తికి సాగు చేయించింది.

కందికి రాష్ట్రవ్యాప్త గిరాకీ జిల్లాలో పండించిన కంది విత్తనాలకు అప్పట్లో రాష్ట్ర వ్యాప్త డిమాండు ఏర్పడింది. స్థానికంగా వాడుకోవడమే కాకుండా విపణిలోనూ విక్రయించి అన్నదాతలు లాభాలు పొందారు. ఉత్పత్తి చేసిన రైతులకు ప్రభుత్వం 50 శాతం రాయితీపై మూల విత్తనం అందించేది. పంట కాలం పాటు పర్యవేక్షణ, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసేవారు. కర్షకులు పండించిన వాటిని బ్రాండెడ్‌గా విక్రయించే ప్రక్రియ కొనసాగకపోవడంతో అనిశ్చితి ఏర్పడింది. విత్తనాల కోసం డీలర్ల వద్దకు రైతులు వెళుతున్నారు. లాభాలున్నా ఈ ప్రక్రియను ముందుకు నడిపించలేదన్న ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం చొరవ చూపితే విత్తనోత్పత్తికి పూర్వవైభవం సంతరించుకునే అవకాశం ఉంది. ఏటా జిల్లాలో వీటి కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. నల్ల, ఎర్ర, సాధారణ సారవంతమైన భూములున్న జిల్లా... విత్తనోత్పత్తికి అనుకూలంగా ఉంది. ప్రభుత్వం చొరవ చూపి లాభాలు ఒనగూరేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పరిశోధన స్థానం సహకారం నారాయణరావుపేట మండల ఇబ్రహీంపూర్ గ్రామ రైతులు వరి విత్తనోత్పత్తికి పంట సాగు చేపట్టి ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గ్రామానికి చెందిన ఏడుగురు చేపడుతున్నారు. సిద్దిపేట గ్రామీణ మండలం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానానికి పంటను విక్రయిస్తున్నారు. 2019 నుంచి 21 ఎకరాల్లో వేస్తున్నారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు రైతులకు కావాల్సిన బ్రీడర్ విత్తనాలను కిలో రూ.72 చొప్పున అందజేస్తున్నారు.

# నీటి విక్రయం.. నాణ్యత ప్రశ్నార్థకం



తాండూరు : జిల్లాలో నాణ్యతలేని తాగు నీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రజల అవసరాన్ని ఆసరా చేసుకుని అక్రమార్కులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అధికారులు తనిఖీలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

ఇష్టానుసారంగా శుద్ధి చేస్తున్నారు

ప్రస్తుత వేసవిలో చాలా మంది శుద్ధి చేసిన నీటిని తాగడానికే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో గ్రామాలే కాకుండా తాండూరు, వికారాబాద్, కొడంగల్, పరిగి పట్టణాల్లోని ప్లాంట్లలో విక్రయిస్తున్న నీటికి డిమాండ్ ఏర్పడింది. దీన్ని అనుకూలంగా మార్చుకున్న ప్లాంట్ల యజమానులు ఇష్టాను సారంగా శుద్ధి చేసి విక్రయిస్తున్నారు.

ఒక్కో లీటరు నీటిలో మినరల్స్ ఉండాల్సినవి ఉండటంలేదు. ఇదే నీటిని ప్లాంట్ల వద్ద విక్రయించి ప్రతి 20 లీటర్ల వద్ద రూ.10 నుంచి రూ.15 వసూలు చేస్తున్నారు. ఆటోలో తీసికెళ్లి ఇళ్ల వద్ద విక్రయిస్తే అదే 20 లీటర్ల వద్ద రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. మొదటి, రెండో అంతస్తులో ఉండే ఇళ్లల్లోకి తీసుకెళ్లాలంటే రూ.25 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా రోజూ వారీగా వేల కొద్ది క్యాన్లలో నింపిన నాణ్యతా ప్రమాణాలు లేని నీటిని విక్రయించి యజమానులు రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు.

ల్యాబ్‌లతో సంబంధం లేకుండానే..నీటిని విక్రయిస్తున్న ప్లాంట్ల యజమానులు నాణ్యతా ప్రమాణాల పరీక్షకు సంబంధించి ల్యాబ్, పరికరాలను ఏర్పాటు చేసుకోవడం విస్మరించారు. భారత ప్రమాణాల సంస్థ నిబంధనల మేరకు ప్లాంట్లలో మైక్రో బయాలజిస్ట్, కెమిస్టు ఉండాలి. ప్లాంట్లలో స్టీలు డ్రమ్ములనే వినియోగించాలి. పైపులైన్లు అంతర్గతంగా ఉండాలి. ప్రతి ప్లాంటులో ఏసీ కచ్చితంగా ఉండాలి. ప్రస్తుతం కొన సాగుతున్న అధికశాతం ప్లాంట్లలో ఎక్కడా ఇవి లేవు.

అనుమతుల్లేని ప్లాంటు 500కుపైనే కొనసాగింపు

జిల్లా వ్యాప్తంగా అనధికారిక లెక్కల ప్రకారం 500కు పైగా నీటి శుద్ధి ప్లాంట్లు కొనసాగుతున్నాయి. ఏ ఒక్కటీ నిబంధనలు పాటించడంలేదని అధికారులే వివరిస్తున్నారు. ఇలాంటి ప్లాంటు నుంచి శుభ్రత, నాణ్యత లేకుండా విక్రయించే నీటిని తాగుతున్న ప్రజలు అనుకోకుండా అనారోగ్యాలకు గురైతే బాధ్యులెవరనే ప్రశ్నలు ఉత్పన్నమౌతున్నాయి.

బల్లులు, ఇతర కీటకాలు పాకులాడే చిన్న పాటి గదులు, రేకుల షెడ్లలో యజమానులు ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. భూగర్భం నుంచి నేరుగా తోడిన నీటికి పెద్దగా పరిజ్ఞానం లేకుండానే రసాయ మందులను కలిపి శుద్ధి చేస్తున్నారు. తర్వాత నిర్ణీత ప్రమాణాల మేరకు శుభ్రం చేయని ప్లాస్టిక్ ట్యాంకుల్లో నిల్వ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఇలాంటి నీటినే తాగుతున్నారు.

జిల్లావ్యాప్తంగా కేవలం రెండు ప్లాంట్లకు మాత్రమే అన్నిరకాల అనుమతులు ఉండడం విశేషం. ఇటీవల అనుమతుల్లేని నీటి శుద్ధి ప్లాంట్లను జప్తు చేస్తామని జిల్లా భూగర్భ వనరుల శాఖ అధికారిణి దీపారెడ్డి ప్రకటించినా ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం.

# పొరుగు నేతలకే పెద్దపీట



తాండూరు : గత రెండు నెలల్లో భారాస నుంచి కాంగ్రెస్ పార్టీలోకి పెద్దఎత్తున నేతలు చేరిపోయారు. దీంతో రాజధానిలో అనేక నియోజకవర్గాల్లో బలపడ్డామని నాయకులు భావిస్తున్నారు. ఇదే సమయంలో క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉండటంతో ఆందోళన సైతం వ్యక్తమవుతోంది. కొత్త, పాత నేతల మధ్య వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. ఇది ఎన్నికల్లో ఎక్కడ ప్రభావం చూపుతుందోననే ఆందోళన సీనియర్ నేతల నుంచి వ్యక్తమవుతోంది. నేతల మధ్య సమన్వయం తీసుకురావడానికి అగ్రనేతలు సంబంధిత నియోజకవర్గ నేతలతో చర్చిస్తున్నారు.

బలం పెంచుకోవడానికి..

రాజధాని పరిధిలో కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కొంత బలహీనంగా ఉంది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు ముందే మొన్నటివరకు అధికార పక్షంగా ఉన్న భారాస నుంచి కీలక నేతలను చేర్చుకోవడం మొదలుపెట్టారు. సుమారు 50 మందికి పైగా నాయకులు హస్తం కండువా కప్పుకున్నారు. హైదరాబాద్ మహానగరపాలక సంస్థలో 12 మంది కార్పొరేటర్లు ఆ పార్టీలో చేరారు. నగరం చుట్టపక్కల ఉన్న నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల స్థానిక ప్రతినిధులు చాలామంది హస్తం గూటికి చేరారు.

అసంతృప్తి..

సుమారు 20 ఏళ్లుగా కాంగ్రెస్‌లోనే ఉంటూ ఎన్నో కష్టనష్టాలు ఓర్చిన సీనియర్ నేతలను కొన్నిచోట్ల పక్కన పెట్టి భారాస నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుండటంతో పూర్వ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. కొత్త నాయకులు చేరితే తాము ఎందుకూ కొరగాకుండా పోతామని ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇప్పటికే కొంతమంది స్థానిక నేతలు కాంగ్రెస్ అగ్రనేతలకు ఫిర్యాదులు చేశారు. ఈ పరిణామంతో లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు ఎక్కడ దెబ్బతగులుతుందోననే ఆందోళన కనిపిస్తోంది.

ఇటీవలే పార్టీలో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ టికెట్ ఆశించిన పూర్వ నేతలు అసంతృప్తితో ఉన్నారు. ఖైరతాబాద్ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి రెండుసార్లు పోటీ చేసిన విజయారెడ్డికి దానంకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. అలాంటి ఆయనకు టికెట్ ఇవ్వడంతో ఆగ్రహంతో ఉన్నారు. వీరిద్దరి మధ్య ఇప్పటికీ సఖ్యత లేదని చెబుతున్నారు. దీని సరిదిద్దే ప్రయత్నాలూ చేయకపోవడం గమనార్హం.

కొంతమంది భారాస కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరగా.. డివిజన్లలో అధికారపక్ష నేతలుగా చలామణి అవుతున్నారు. గతంలో అక్కడ పోటీ చేసి ఓడిపోయిన నేతలకు ఇది మింగుడుపడటం లేదు.

మొన్న జరిగిన కంటోన్మెంట్ ఎన్నికల్లో భాజపా అభ్యర్థిగా పోటీ చేసిన శ్రీ గణేష్‌ను రాత్రి రాత్రికి కాంగ్రెస్‌లో చేర్చుకొని ఉప ఎన్నికల్లో బరిలో నిలిపారు. దీంతో అక్కడ ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలందిస్తున్న నాయకులు కంగుతిన్నారు. గతంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసి ఓడిపోయిన డీబీ దేవేందర్ ఆగ్రహంతో ఉన్నారు. శ్రీ గణేష్‌కు కాకుండా అసలైన వారికి టికెట్ ఇవ్వాలని కోరినా అగ్రనేతలు పట్టించుకోలేదు.

గతంలో అనేక ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన గజ్వేల్ భరత్ ఇక్కడి అయిదో వార్డు నుంచి కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల్లో పోటీ చేయాలని అనుకున్నారు. ఈలోగా భారాస నాయకుడు తేలుకుంట సతీష్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకుని అదే వార్డు నుంచి పోటీ చేస్తారని సీనియర్ నేతలు ప్రకటించారు. దీంతో భరత్ ఆగ్రహంతో ఉన్నారు. ఇలా అనేకమంది నేతలు తమ అవకాశాలను ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు తన్నుకుపోతున్నారంటూ ఆవేదనతో ఉన్నారు.

# చితికిపోతున్న.. చిరు వ్యాపారులు

మెదక్ : జిల్లాలోని పురపాలికల్లో వీధి వ్యాపారుల కోసం షెడ్ల నిర్మాణం ప్రతిపాదనల దశ దాటడం లేదు. మెదక్‌లో నిర్మాణం చేపట్టినా ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. నర్సాపూర్, రామాయంపేట పురపాలికల్లో ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. తూప్రాన్‌లో సమీకృత మార్కెట్ ఉందనే సాకుతో వీధి వ్యాపారులకు షెడ్లకు ప్రతిపాదించలేదు. దీంతో ప్రధాన రోడ్లపైనే ప్రమాదకర పరిస్థితుల్లో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో వీరిని గుర్తించి రుణాలు పంపిణీ చేసినా షెడ్ల నిర్మాణం చేపట్టడంలో విఫలమవుతోంది. వీధి వ్యాపారాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పరిశీలనాత్మక కథనం...

ప్రమాదకర పరిస్థితుల్లో..

జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాలైన మెదక్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్‌లలో ప్రధాన రోడ్ల వెంట చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారు అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. ఎండ, వాన, చలికి ఇబ్బందులు పడుతూ వ్యాపారాల్ని కొనసాగిస్తున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ పథకం(పీఎం స్వనిధి) ద్వారా చేయూత అందించింది. మెప్మా ఆధ్వర్యంలో వీరిని గుర్తించి మూడు విడతల్లో రుణాలను పంపిణీ చేసింది. రోడ్ల పక్కన షెడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. అయితే నేటికీ అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రుణాలు మంజూరు చేయించిన మెప్మా ఆర్పీలు ఆ తర్వాత ఇటువైపు చూడటం లేదు. షెడ్ల నిర్మాణానికి కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేసినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. కనీసం స్థలాలు సైతం గుర్తించలేదు.అద్దెల భారంతో..ప్రధాన రోడ్లపైన చిరు వ్యాపారాలు సాగిస్తున్న వారు తైబజార్, అద్దెల భారంతో సతమతమవుతున్నారు. రోడ్లపక్కన తోపుడు బండ్లపై, పాదబాటలపై వ్యాపారాలు చేసుకుంటున్న వారి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ప్రధాన రోడ్లపై చిన్నచిన్న దుకాణం అద్దెకు తీసుకోవాలంటే లక్షల్లో అడ్వాన్స్‌లు, వేలల్లో అద్దెలు ఉన్నాయి. అప్పులు చేసి దుకాణాలు అద్దెకు తీసుకొని వ్యాపారాలు ప్రారంభిస్తే వ్యాపారాలు సరిగా సాగక ఆర్థిక ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు.జిల్లాలో ఇదీ పరిస్థితి....

మెదక్ పురపాలికలో పట్టణ ప్రగతి నిధులు రూ.35లక్షలతో ప్రధాన రోడ్డు పక్కన 25 షెడ్ల నిర్మాణం పూర్తిచేసి ఏడాది అవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇందుకు మెప్మా నుంచి 3.75లక్షలు కేటాయించారు. ఫ్లోరింగ్ టైల్స్ వేసి, విద్యుత్ కనెక్షన్ ఇస్తే షెడ్లు వినియోగంలోకి వస్తాయి.నర్సాపూర్‌లో మెదక్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన అటవీ శాఖ కార్యాలయం సమీపంలోని పాదబాటపై తాత్కాలిక షెడ్ల నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రతిపాదించారు. ఇంతవరకు ఎలాంటి చర్యలు లేవు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తుండటంతో ఏదైనా వాహనం అదుపుతప్పితే పెద్ద ప్రమాదం జరిగే ఉంది.

# ప్రాదేశిక ఎన్నికలకు రంగం సిద్ధం

ఖమ్మం : రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన సామగ్రి సమకూర్చుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి పంచాయతీరాజ్ కమిషనర్ సహా జిల్లా పరిషత్‌లకు సూచనలందాయి. 2019 మే మాసంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జులై 4న, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం జులై 5న ముగియనుంది. ఈలోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. గత ఐదేళ్ల వ్యవధిలో కొత్తగా కొన్ని మండలాలు ఏర్పాటయ్యాయి. ఆయా మండలాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను పునర్విభజన చేయాల్సి ఉంటుంది. మే 25 నాటికి పునర్విభజన ప్రక్రియ పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది.

జూన్ 30 నాటికి రిజర్వేషన్ల ప్రక్రియ

బ్యాలెట్ పత్రాల ముద్రణకు కావాల్సిన పింక్, తెలుపు రంగు పేపర్ వివరాలు సిద్ధం చేసి ఆయా జడ్పీలు పంచాయతీరాజ్ కమిషనర్‌కు మే 5 వరకు ప్రతిపాదనలు పంపించాలి.

ఎన్నికల మార్గదర్శకాలకు సంబంధించి హ్యాండ్ బుక్స్, శిక్షణ



కార్యక్రమాలకు సరిపడా పత్రాలు, పుస్తకాలను మే 31 నాటికి ముద్రించాలి.

ఓటేసిన వారి చేతి వేలికి గుర్తుగా రాసే సిరా (ఇండెబుల్ ఇంక్)ను జూన్ 30 నాటికి సిద్ధం చేసుకోవాలి.

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల ఓబీసీ రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను జూన్ 30 నాటికి ప్రభుత్వం పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ సూచించారు. అంతకుముందు ఆయా జడ్పీలు ముందస్తు ప్రక్రియను ముగించాల్సి ఉంటుంది.

20 శాతం అదనంగా ముద్రణ

తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రెండో సాధారణ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు. సరిపడా బ్యాలెట్ పెట్టెలు, పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ సమకూర్చుకోవాలని జడ్పీ సీఈఓలకు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి లేఖ రాశారు. అన్ని జడ్పీలకు కలిపి పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ 1.80 లక్షల చొప్పున అవసరమని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. వీటిని చంచల్‌గూడలోని ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్ నుంచి కొనాలని సూచించింది. జిల్లాల వారీగా మే 15 నాటికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించింది. 2019 ఎన్నికల ప్రకారం ఖమ్మం జడ్పీ పరిధిలోని 20 మండలాల్లో 1,816 పోలింగ్ కేంద్రాలకు పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ 8,800 చొప్పున, భద్రాద్రి జడ్పీ పరిధిలోని 21 మండలాల్లో 1,338 పోలింగ్ కేంద్రాలకు పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ 6,500 చొప్పున అవసరమని తెలిపింది. ప్రతి పోలింగ్ కేంద్రంలో నాలుగు చొప్పున పేపర్ సీళ్లు, అడ్రస్ ట్యాగ్స్ అవసరమవుతాయి. మొత్తమ్మీద 20 శాతం అదనంగా ముద్రించుకోవాలి. ఆయా జిల్లాల్లో అందుబాటులో ఉన్న బ్యాలెట్ పెట్టెల వివరాలు సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించింది. ఎన్నికల సమయం కంటే ముందుగానే జిల్లాల వారీగా కావాల్సిన బ్యాలెట్ పెట్టెలను ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించే అంశాన్ని రాష్ట్రస్థాయి అధికారులు నిర్ణయించనున్నారు.

# ఇసుక దోచేస్తున్నారు..

నిర్మల్ : జిల్లాలోని నదులు, వాగులు తదితర ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరగకుండా చూడాలని ఇటీవల జిల్లా పాలనాధికారి అశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కొన్ని రోజులు వరుస దాడులు జరిపి ఇసుక అక్రమ రవాణా జరగకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శాఖల అధికారులు విధుల్లో బిజీగా ఉండడంతో ఇదే అనువుగా భావించి అక్రమార్కులు జిల్లాలోని స్వర్ణ వాగులోని ఇసుకను దోచేస్తున్నారు. జిల్లాలోని జలాశయాల్లో అత్యధికంగా ఇసుక లభ్యమయ్యేదాంట్లో ఒకటి స్వర్ణ వాగు. కురిసిన భారీ వర్షాలకు మిగులు జలాలు బయటకు వదలడంతో ఆయా ప్రాంతాల్లో ఇసుక పెద్ద మొత్తంలో వచ్చి చేరింది. సారంగాపూర్, దిలావర్‌పూర్, నిర్మల్ గ్రామీణం, పట్టణం, సోన్ మండలాల పరిధిలోని పరివాహక ప్రాంత కొన్ని గ్రామాల్లో అనధికారికంగా వేలం నిర్వహించి రూ.లక్షలు వెచ్చించి వాటిని దక్కించుకుంటున్నారు. ఒక ప్రాంతంలోనైతే ఏకంగా రూ.10 లక్షలకుపైనే పలికిందంటే ఎంతటి లాభాలున్నాయో అర్థం చేసుకోవచ్చు. మార్కెట్‌లో ఒక్కో ట్రాక్టర్ ఇసుక ధర రూ.3,500 నుంచి రూ.4 వేల వరకు పలుకుతుండటంతో ఇదే అదునుగా భావించి అందినకాడికి దోచుకుంటున్నారు.

ప్రమాదకరంగా..స్వర్ణ నదిలో పలు చోట్ల చెక్‌డ్యాంలు నిర్మించడంతో నీళ్లు నిలిచి ఇసుక తీసేందుకు సదరు వ్యాపారులకు ఆటంకంగా మారింది. అయినా ట్రాక్టర్‌కు ప్రత్యేక పరికరాలు అమర్చి, భారీ పార లాంటిదానిని ఏర్పాటు చేసి నీటి అడుగుభాగంలో నుంచి వెలికితీస్తున్నారు. ఇందుకు కొందరు కూలీలకు పనులు అప్పజెబుతుండడంతో ప్రాణాలకు తెగించి వాటిని నిర్వహిస్తున్నారు.సన్నని ఇసుకను జిల్లాకు భారీ లారీల్లో తీసుకొస్తున్నారు. వీటిని ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రదేశాల్లో నిల్వ చేయాల్సి ఉంటుంది. లేదానేరుగా సంబంధిత నిర్మాణ ప్రాంతానికి తరలించాలి. అలాంటి నిబంధనలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోని భైంసా, ఖానాపూర్, ఆర్మూర్, ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రధాన మార్గాల పక్కనే భారీ లారీలను నిలిపి అక్కడి నుంచే వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కొంత మంది రోడ్లపైనే ఇసుకను నిల్వ చేసి అమ్మకాలు జరుపుతున్నారు. వాహనాలు నిలపడంతో ఆ రోడ్ల వెంట రాకపోకలు సాగించే మిగతా వాహనాల చోదకులు, ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతోంది.సోన్ మండలం శాకెర గ్రామ సమీపంలో చెక్‌డ్యాం నిర్మించారు. ఆ నీళ్లు ప్రస్తుతం పట్టణ శివారులోని సిద్దాపూర్ దాటి మంజులాపూర్ శివారు వరకు వ్యాపించాయి. కురిసిన భారీ వర్షాలతో ఇసుక వచ్చి పెద్ద మొత్తంలో ఆయా ప్రాంతాల్లో నిల్వ ఉంది. దీన్ని వెలికితీసేందుకు కొందరు అనధికారికంగా కొంత మొత్తం ముట్టజెప్పి వేలం పాటలో దక్కించుకుని వెలికితీత చేపడుతున్నారు. ట్రాక్టర్‌కు తాడు, ఇనుప తీగను అమర్చి భారీ పారలాంటి పరికరంతో లోపల ఉన్న ఇసుకను బయటకు తీయిస్తున్నారు. కూలీలు ప్రాణాలకు తెగించి లోపలికి వెళ్లి అమర్చి వాటిని ట్రాక్టర్‌కు బిగించిన యంత్రంతో బయటకు ఇలా తీస్తున్నారు. అక్కడే జల్లెడ పడుతున్నారు.నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల్, పట్టణంలోని మంజులాపూర్ మధ్య ఉన్న స్వర్ణ వాగు ప్రస్తుతం ఎడారిని తలపిస్తుంది. చిట్యాల్ వద్ద చెక్‌డ్యాం నిర్మించినా నీటి నిల్వ మాత్రం లేదు. దీనికి ప్రధాన కారణం అక్కడ ఉన్న ఇసుకను యథేచ్ఛగా కొందరు అక్రమంగా తరలించడమే.




## సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

సూర్యాపేట: కోదాడ పట్టణ పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగిఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొట్టడంతో అందులో ఉన్న ఓ చిన్నారితో సహా ఆరుగురు చనిపోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. ఆరుగురు ఘటనాస్థంలోనే చనిపోయారు. గాయపడిన ఇద్దరిని కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు..





హైదరాబాద్, ఏప్రిల్ 25: తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావుపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభాకర్ రావుపై లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు పోలీసులు. ఇప్పుడు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారనే ప్రచారం జరగడం ఈ కేసులో కీలకంగా మారింది. ఫోన్ టాపింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రభాకర్ రావు విదేశాలకు వెళ్లిపోయాడు. దీంతో ప్రభాకర్ రావు ఆచూకీ కోసం పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. లుక్ అవుట్ నోటీసులకు స్పందన లేకపోవడంతో.. రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేశారని తెలుస్తోంది. అమెరికాలోని టెక్సాస్‌లో ప్రభాకర్ రావు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆరు నెలల విజిటింగ్ వీసా మీద ప్రభాకర్ రావు అమెరికాకు వెళ్లినట్లు గుర్తించారు పోలీసులు. ఇప్పటికే రెండు నెలలు పూర్తయిన నేపథ్యంలో ప్రభాకర్ రావు నాలుగు తరువాత ఇండియాకు వచ్చే అవకాశం ఉంది. మరోవైపు కేసులో సాక్ష్యాలను బట్టి విచారణను వేగవంతం చేశారు పోలీసులు.

**సంచలన కేసులు..** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సంచలన పరిణామం కూడా చోటు చేసుకుంది. అరెస్ట్ అయిన పోలీసులపై సైబర్ టెర్రరిజం సెక్షన్లు నమోదు చేశారు. దేశ భద్రతకు సాఫ్ట్‌వేర్ ద్వారా ముప్పు వాటిల్లేలా చేస్తే వారిపై ఈ సైబర్ టెర్రరిజం కేసులు నమోదు చేస్తారు. అలాంటి ఐటీ యాక్ట్ 66(F)ను ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రయోగిస్తున్నారు పోలీసులు. ఐటీ యాక్ట్ సెక్షన్ 66(F) జోడీ కోర్టులో మెమో దాఖలు చేశారు. సెక్షన్ 66(F) కింద కేసు ప్రూఫ్ అయితే జీవిత ఖైదీగా శిక్ష పడే అవకాశం ఉంది. ఇప్పటికే ఐటీ యాక్ట్ 70 కింద కేసు నమోదు చేశారు. ఐటీ యాక్ట్ 70లో 10 సంవత్సరాల జైలు శిక్ష పడుతుంది. తాజాగా ఐటీ యాక్ట్ సెక్షన్ 66(F) కింద కేసు నమోదు చేశారు పోలీసులు.

ఫోన్ ట్యాపింగ్‌తో సైబర్ టెర్రరిజానికి పాల్పడినట్లు పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే, ఐటీ యాక్ట్ కింద కేసులు నమోదుకు అనుమతించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు పోలీసులు.

## ఆ ప్రాజెక్టు కోసం కేసీఆర్‌ని విచారిస్తాం.. జస్టిస్ చంద్ర ఘోష్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్: కాళేశ్వరం బ్యారేజీల అవకతవకలు, మేడిగడ్డ బ్యారేజ్ కుంగడం తదితర విషయాలపై విచారించడానికి జస్టిస్ చంద్ర గోష్ కమిషన్‌ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన విషయం తెలిసిందే. నేటి(గురువారం) నుంచి జస్టిస్ చంద్ర ఘోష్ విచారణను ప్రారంభించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలను దృష్టిలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా మీడియాతో జస్టిస్ చంద్ర ఘోష్ చిట్‌చాట్ చేశారు. మీడియాతో పలు కీలక విషయాలను పంచుకున్నారు. అవసరం అయితే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పిలిచి కాళేశ్వరం ప్రాజెక్టుపై తమకు కావాల్సిన సమాచారాన్ని సేకరిస్తామని అన్నారు. రెండు, మూడు రోజుల్లో కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై ప్రజల నుంచి కూడా అభిప్రాయ సేకరణ చేస్తామని తెలిపారు. విచారణలో నిపుణుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్ట్, కాగ్ రిపోర్టులను కూడా దృష్టిలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంజనీర్లతో త్వరలోనే భేటీ అవుతామని.. ఎన్డీఎస్ఏ అథారిటీతో కూడా సమావేశం అవుతామని స్పష్టం చేశారు. టెక్నికల్ అంశాలను పరిగణనలోకి తీసుకొని విచారణ కొనసాగిస్తామన్నారు. తాను స్వతహాగా ఇంజనీర్‌ని కాదని.. తనకు అందరి సహాయ సహకారాలు అవసరమని వివరించారు. తాను ముఖాలను చూసి విచారణ చేయనని.. లీగల్ అంశాల ఆధారంగానే విచారణ కొనసాగుతుందని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టుకు సంబంధం



ఉన్న అందరినీ కలుస్తామని.. తమకు కావాల్సిన సహాయ సహకారాలను తీసుకొని విచారణ చేస్తామన్నారు. లీగల్ సమస్యలు తలెత్తకుండా విచారణ కొనసాగిస్తామని.. ఏమైనా ఇబ్బంది అయితే స్టే వచ్చే అవకాశం కూడా ఉంటుందన్నారు. నిర్మాణ సంస్థలతో పాటు అవసరమైతే రాజకీయ నాయకులకు సైతం నోటీసులు ఇవ్వాల్సి వస్తే ఇస్తామని స్పష్టం చేశారు. రెండో విడతలో భాగంగా మేడిగడ్డ గ్రౌండ్‌కు వెళ్లి బ్యారేజీలను పరిశీలిస్తామని వివరించారు. ఇప్పటికైతే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని.. చాలా విషయాలను తెలుసుకున్నామని అన్నారు. నివేదికల ఆధారంగానే విచారణ కొనసాగుతుందని.. దాంతోపాటు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటామని జస్టిస్ చంద్ర గోష్ పేర్కొన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




## రిజర్వేషన్ల రద్దుకు భాజపా కుట్ర: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అన్నింటా జీఎస్టీ విధించి ఎన్డీయే ప్రభుత్వం దోపిడీకి పాల్పడుతోందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అగ్గిపెట్టె, సబ్బుబిళ్ల కూడా దానికి అతీతం కాదని చాటిచెప్పారని ఎద్దేవా చేశారు. పదేళ్ల ఎన్డీయే పాలనపై గాంధీభవన్‌లో నిర్వహించిన ఛార్జ్‌షీట్ విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "కార్పొరేట్ కంపెనీలకు ఎన్డీయే ప్రభుత్వం లొంగిపోయింది. గత ప్రధానులందరూ కలిసి రూ.54 లక్షల కోట్లు అప్పులు చేశారు. కానీ పదేళ్లలో మోదీ ప్రభుత్వం రూ.113 లక్షల కోట్ల అప్పులు చేసింది. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, జాతీయ రహదారులను కార్పొరేట్లకు కట్టబెట్టారు. రూ.60 లక్షల కోట్ల ఆస్తులను రూ.6 లక్షల కోట్లకు తెగనమ్మారు. డబుల్ ఇంజిన్ పేరిట దేశాన్ని భాజపా దోచుకుంది. స్విస్ బ్యాంకుల్లోని నల్లధనం తెచ్చి ప్రజలకు పంచుతామన్నారు. ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు తదితర హామీలతో ప్రధాని మోదీ మోసగించారు. మూడు నల్లచట్టాలను తీసుకొచ్చి రైతులను బానిసలుగా మార్చేందుకు యత్నిస్తున్నారు. కాంగ్రెస్‌పై విష ప్రచారం చేసి ఎలాగైనా గెలవాలని భాజపా అనుకుంటోంది. రాజ్యాంగం కల్పించిన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తోంది. దీని కోసం ఆ పార్టీకి 400 సీట్లు కావాలి. ఆర్ఎస్ఎస్ అజెండాను భాజపా అమలు చేసింది. అందుకే రాజ్యాంగంపై ఆఖరి యుద్ధం ప్రకటించింది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## తెలంగాణలో మళ్లీ మొదలైన ప్లెక్సీ వార్.. మోదీ హామీలను టార్గెట్ చేస్తూ..




హైదరాబాద్ : దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న తరుణంలో.. తెలంగాణలో మళ్లీ ఫ్లెక్సీ వార్ మొదలైంది. బీజేపీని టార్గెట్ చేస్తూ.. గాంధీభవన్ ఎదుట 'నయవంచన' పేరుతో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. "పదేండ్ల మోసం - వందేళ్ల విధ్వంసం" అంటూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఇచ్చిన హామీలకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం సాగిందని అందులో ఎత్తిచూపారు. 2014 ఎన్నికల సమయంలో సంవత్సరానికి రెండు కోట్లు చొప్పున ఉద్యోగాలు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారని.. మరి మీ పదేళ్ల పాలనలో 20 కోట్లు ఉద్యోగాలు ఇచ్చారా? అని ఆ ఫ్లెక్సీలో ప్రశ్నించారు. తెలంగాణకు ఒక్క యూనివర్సిటీ కూడా ఇవ్వని బీజేపీ ప్రభుత్వం.. కృష్ణా జిల్లాలో ఆంధ్రాకే ఎక్కువ వాటా ఇచ్చారని పేర్కొన్నారు. గత పదేండ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదన్న అంశాన్ని కూడా హైలైట్ చేశారు. గతంలో తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల్ని తగ్గిస్తామని మోదీ ఇచ్చారని.. కానీ అందుకు భిన్నంగా వాటి ధరలు ఆకాశాన్నంటాయని రాసుకొచ్చారు. ధరలు పెంచేసి, పేదలపై ఆర్థిక భారం మోపారంటూ ఆరోపించారు. అందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి, ఆ హామీని తుంగలో తొక్కేశారన్నట్టుగా ఫ్లెక్సీని డిజైన్ చేశారు. అలాగే.. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోదీ మాటిచ్చారని, అవినీతిని కూడా రూపుమాపుతామని చెప్పారని, మరీ ఈ పదేళ్లలో అవి జరిగాయా? అని ప్రశ్నిస్తున్నట్టు ఫ్లెక్సీలో చిత్రాలను డిజైన్ చేశారు. విదేశాల్లో నల్లధనాన్ని వెనక్కు తీసుకొచ్చి, ఒక్కొక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని మోదీ హామీని గుర్తు చేస్తూ.. మా రూ.15 లక్షలు ఎక్కడ అని నిలదీశారు. సరిహద్దులో చైనా భారత భూభాగాన్ని ఆక్రమిస్తుంటే.. చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించలేదంటూ అబద్ధాలు చెప్తున్నారని పేర్కొన్నారు. తీవ్రవాదాన్ని నిర్మూలిస్తామన్న మాటని సైతం గాలికొదిలేశారన్న అర్థం వచ్చేలా ఫ్లెక్సీలో ఫోటోల్ని అమర్చారు. మరి.. దీనికి కౌంటర్‌గా బీజేపీ వాళ్లు ఎలాంటి ఫ్లెక్సీలని దింపుతారో చూడాలి.

## తెలంగాణను ఢిల్లీ ఏటీఎంగా మార్చారు.. కాంగ్రెస్ నేతలపై షా ఫైర్!



సిద్దిపేట : లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు మరో పక్షం రోజుల సమయమే ఉండడంతో బీజేపీ అగ్ర నాయకత్వం తెలంగాణపై దృష్టి పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ బహిరంగ సభలు, రోడ్డు షోలు, వీధి సమావేశాలు, ఇంటింటి ప్రచారం ఉధృతం చేసింది. ఆయా సభలు, రోడ్డు షోల్లో పాల్గొనేందుకు బీజేపీ అగ్ర నాయకత్వం తరలివస్తోంది. మెదక్ పార్లమెంటు అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా సిద్దిపేట సభలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేంద్ర మంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కశ్మీర్‌ను భారత్‌లో శాశ్వతంగా అంతర్భాగం చేసేందుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారు.

తెలంగాణలో 12 స్థానాల్లో బీజేపీని గెలిపించాలి. అయోధ్యలో రామమందిరం కోసం మోదీ కృషి చేశారు. మజ్లిస్‌కు భయపడటం వల్లే బీఆర్ఎస్, కాంగ్రెస్ విమోచన దినోత్సవం నిర్వహించట్లేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు తీసుకువస్తాం. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఏకతాటిపై నడుస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతిలో మునిగిపోయాయి. కాంగ్రెస్ నేతలు తెలంగాణను ఢిల్లీ ఏటీఎంగా మార్చారు' అని అమిత్‌షా తీవ్ర ఆరోపణలు చేశారు.

**ప్రధాని వచ్చేస్తున్నారు..!** ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో ప్రధాని మోదీ మూడు రోజుల పాటు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ నెల 30న ప్రధాని జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆంధోల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం, శేరిలింగంపల్లి పరిధిలోని ఐటీ ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మే-03న వరంగల్ పార్లమెంటు పరిధిలో నిర్వహించే బహిరంగ సభలో మోదీ పాల్గొంటారు. అలాగే, నల్లగొండ, భువనగిరి నియోజకవర్గాల కోసం సంయుక్తంగా నిర్వహించే మరో సభకూ హాజరవుతారు. 4న నారాయణపేట, వికారాబాద్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొంటారు.

## భాజపా మాట నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్లే: హరీశ్‌రావు



మెదక్: భారాస హయాంలో మెదక్‌కు రైలు తీసుకువచ్చినట్లు మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు అన్నారు. మెదక్‌లో నిర్వహించిన భారాస ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. "మా ప్రభుత్వంలో మంజీరాపై చెక్‌డ్యామ్‌లు కట్టినందునే పంటలు ఎండిపోలేదు. ఈ ప్రాంతానికి మూడు మెడికల్ కళాశాలలు తీసుకువచ్చాం. వంద రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ నేతలు బాండ్ పేపర్ రాసిచ్చారు. గతంలో బాండ్ పేపర్‌కు విలువ ఉండేది.. సీఎం రేవంత్ మోసంతో దాని విలువ పోయింది. ప్రజలు నమ్మడం లేదని ఎక్కడికెళ్తే అక్కడి దేవుళ్లపై ఒట్టు పెడుతున్నారు. రేవంత్.. ఆగస్టు 15 లోపు రుణమాఫీ, ఆరు హామీలు అమలు చేయాలి. కేంద్రంలో భాజపా పాలనలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలు పెరిగాయి. ఏ ఒక్క వర్గానికీ మేలు చేయలేదు. పేదల గురించి భాజపా ఎప్పుడూ ఆలోచించలేదు. ఆ పార్టీ మాట నమ్మితే నీళ్లు లేని బావిలో దూకినట్లే" అని హరీశ్‌రావు అన్నారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 îEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660